

9న పెద్దాపురంలో అన్నదాత పోరు

ప్రజాశక్తి - కాకినాడ

ఈ నెల 9న పెద్దాపురం రెవెన్యూ డివిజనల్ కార్యాలయం వద్ద 'ఎరువుల బ్లాక్ మార్కెట్ -అన్నదాత పోరు' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైసిపి జిల్లా అధ్యక్షుడు దాడిశెట్టి రాజా పిలుపునిచ్చారు. శనివారం స్థానిక వైసిపి కార్యాలయంలో అన్నదాత పోరు కార్యక్రమం పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎరువుల కోసం రైతులు పడిగాపులు పడాల్సిన పరిస్థితి ఏర్పడడం దురదృష్టకరమన్నారు. ప్రభుత్వానికి సరైన ప్రణాళిక లేకపోవడం వలనే ఈ పరిస్థితి ఏర్పడిందన్నారు. ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకే ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి తోట నరసింహం, మాజీ ఎంపి వంగా గీతా, మాజీ ఎంఎల్‌ఎ ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

ఎలుకల నిర్మూలన సాధ్యమేనా.!

- వరిపై పెరుగుతున్న దాడి
- దిగుబడులపై అన్నదాతల్లో ఆందోళన
- అదనపు భారంతో అగచాట్లు

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

ప్రస్తుతం వరి రైతుపై ముప్పేట దాడి జరుగుతుంది. నిన్న, మొన్నటి వరకు సాగునీటి కొరతతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోగా, ప్రస్తుతం ఎరువులు కొరత తీవ్రంగా వేధిస్తోంది. దీనికి తోడు మూషికాల దాడి పంటపై విపరీతంగా పెరిగిపోయింది. ఎలుకల బెడదతో దిగుబడిపై తీవ్ర ప్రభావం పడుతుందంటూ కర్షకులు ఈ సందర్భంగా ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎలుకల నివారణకు అదనపు భారంతో తీవ్రంగా సతమతమవుతున్నారు. ఈ నేపథ్యంలో వ్యవసాయ శాఖ చేపట్టిన సామూహిక ఎలకల నిర్మూలన కార్యక్రమం ఎటువంటి సత్ఫలితాలను ఇస్తుందనేది ప్రశ్నార్థకంగా మారింది.

జిల్లాలో సుమారు 2.23 లక్షల ఎకరాల్లో వరి, దాదాపు 70 వేల ఎకరాల్లో పత్తి, ఆపరాలు, ఇతర పంటలను సాగు చేస్తున్నారు. ప్రస్తుతం అన్ని మండలాల్లోనూ ఎలుకల బెడద కనిపిస్తుంది. ముందుగా నాట్లు పడిన చోట్ల వరి చిరుపొట్ట దశకు చేరుకుంటుంది. ఈ క్రమంలో పంటలపై ఎలుకలు దాడి మొదలు పెట్టాయి. ఈ ఏడాది కూడా రైతులు ఎక్కువగా ఎదజల్లు పద్ధతిలో సాగు చేపట్టారు. ఈ పొలాల్లో ఎక్కువగా ఎలకల ఉధృతి కనిపిస్తుంది. తమ పంటలపై ముప్పేట దాడి చేస్తూ తీవ్ర నష్టాన్ని కలుగజేస్తున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

అదనపు భారం

ఇప్పటికే రైతులను ఎరువుల కొరత తీవ్ర అవస్థలకు గురి చేస్తున్నది. సరిపడా యూరియా అందుబాటులో లేకపోవడంతో పంట దిగుబడిపై రైతులు దిగాలుగా ఉన్నారు. వరి దుబ్బు కట్టి ఏపుగా పెరగాలంటే కచ్చితంగా యూరియా వాడకం తప్పనిసరి. అయితే ప్రభుత్వం ఎరువుల సరఫరాలో తీవ్ర నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తుందంటూ రైతులు వాపోతున్నారు. అరకొర ఎరువులే అందుబాటులో ఉంటున్నాయంటూ ఆరోపిస్తున్నారు. దీంతో దిక్కు తోచని స్థితిలో పలువురు ఎరువుల దుకాణాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. బ్లాక్‌లోనైనా సరే కొనుగోలు చేసి యూరియాను వినియోగిస్తున్న పరిస్థితి ఏర్పడింది. ఇదే క్రమంలో ఎలుకల దాడి విపరీతంగా ఉందంటూ చెబుతున్నారు. ఎలుకలు పట్టించడానికి ఎకరాకు రూ.3 వేల నుంచి 4 వేలు అదనంగా భారం పడుతోంది. ఎకరా పొలంలో 20 నుంచి 50 ఎలుకల వరకూ పట్టుబడుతున్నాయి. ఎలుకలు పట్టివేతకు బుట్టలు పెడితే ఒక్కొక్క ఎలుకకు రూ.40 రూ.50 చొప్పున వసూలు చేస్తున్నారు. వంద గ్రాములు విషపు ఎర తయారు చేయడానికి 96 గ్రాముల నూకలు, 2 గ్రాముల నూనె, 2 గ్రాముల బ్రోమోడైలోన్ రసాయనాన్ని కలిపి మిశ్రమం తయారు చేస్తారు. ఈ మిశ్రమాన్ని ఎలుక రంధ్రాలు ఉన్నచోట్ల పెట్టడం ద్వారా నివారణ చేస్తున్నారు. అయితే ఎలుకల వలన పంటలో 15 శాతం నష్టం జరుగుతుంది. రెండు, మూడు సార్లు పట్టిస్తే తప్ప పంట దక్కే పరిస్థితి లేదని పిఠాపురం మండలం భోగాపురం గ్రామానికి చెందిన దేవిరెడ్డి నాగబాబు, దేవిరెడ్డి కన్నయ్య, ఇనుకొండ చిట్టిబాబు, గొల్లల అప్పన్న, గుర్రం సత్తిబాబు తదితర రైతులు ఎలుకల బెడద ఆర్థిక ఇబ్బందులను తెచ్చిపెడుతోందంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే చీడపీడలు మొదలుకొని పెరుగుతున్న ఎరువులు, పురుగుమందుల ధరలతో కుదేలవుతున్న రైతులపై మూషికాలు బెడద వలన అదనపు భారంతో అప్పుల పాలవుతున్నారు.



పిఠాపురంలో సామూహిక ఎలుకల నిర్మూలన కార్యక్రమం

నివారణ సాధ్యమేనా.?

వేల సంఖ్యలో పుట్టుకొస్తున్న ఎలుకలు అనుకూల వాతావరణాన్ని ఉపయోగించుకుని నాట్లు వేసిన తర్వాత పైరును పిలక, చిగుడు దశలో కొట్టేస్తూ నష్టాన్ని మిగుల్చుతున్నాయని రైతుల ఆవేదన. అయితే వ్యవసాయ శాఖ ఏటా చేపడుతున్న సామూహిక ఎలుకల నివారణ కార్యక్రమం సరైన ఫలితాలను ఇవ్వలేకపోతుందా అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. పెరిగిన ఎలుకల దాడి నేపథ్యంలో రెండు, మూడు సార్లు మందు పెడితేనే గాని నిర్మూలన సాధ్యం కాని పరిస్థితి ఏర్పడింది. అయితే అధికారులు ఒక్కసారి మాత్రమే మందును ఉచితంగా ఇస్తున్నారు. ఆ తర్వాత రైతులు ఎలుకలను నివారించడానికి అదనపు భారం మోయాల్సి వస్తుంది. ఈనెల 4న ఒకే రోజు సామూహిక ఎలుకల నివారణ కార్యక్రమం జరిపారు. దీనిలో భాగంగా జిల్లాలో వరి మొత్తం విస్తీర్ణంలో సామూహిక ఎలుకల నివారణకు వ్యవసాయ శాఖ దాదాపు వెయ్యి కేజీల బ్రోమోడైలిన్ మందును పంపిణీ చేసింది.

నష్ట పోతున్నాం..



ఏటా సాగునీటి కష్టాలతోపాటు, ఎరువుల బెడద ఎక్కువగా ఉంది. దీనికితోడు ఎలుకల దాడి పెరిగింది. పంట దిగుబడి పై ప్రభావం చూపే అవకాశం కనిపిస్తుంది. ఎలుకల నివారణకు అదనపు భారం పడుతుంది. ఇప్పటికే ఎకరాకు రూ.40 వేలు వరకు పెట్టుబడులు అవుతున్నాయి.

-సుంకర భాస్కరరావు,రైతు,రాపర్తి, పిఠాపురం మండలం

నిర్మూలనకు స్పెషల్ డ్రైవ్

ఎలుకల నివారణకు బ్రోమోడయోలిన్ మందు పంపిణీ చేసాం. ఒకే రోజు జిల్లా అంతటా ఈ కార్యక్రమం జరిపాము. సామూహిక ఎలుకల నివారణ కోసం రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. వారి ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని వ్యవసాయ శాఖ చేపట్టిన సామూహిక ఎలుకల నిర్మూలన సత్ఫలితాలను ఇస్తుంది.

-ఎన్.విజయ్‌కుమార్, జెడి, వ్యవసాయ శాఖ



రెవెన్యూ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న సిపిఎం నాయకులు, కార్యకర్తలు

ట్రంప్ సుంకాలకు వ్యతిరేకంగా సిపిఎం ధర్నా

ప్రజాశక్తి - సామర్లకోట

అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ భారతదేశంపై విధించిన 50 శాతం సుంకాలను వ్యతిరేకిస్తూ సిపిఎం ఆధ్వర్యంలో ధర్నా జరిగింది. శనివారం మండల రెవెన్యూ కార్యాలయం ఎదుట నిర్వహించిన ధర్నాలో సిపిఎం జిల్లా కార్యదర్శి కరణం ప్రసాద్‌రావు మాట్లాడారు. ట్రంప్ విధించిన 50 శాతం సుంకాల వల్ల జిల్లాలోని ఆక్వా రంగం తీవ్ర సంక్షోభంలోకి వెళ్లిందని అన్నారు. ఏడాదిలో 10 లక్షల టన్నుల ఆక్వా ఉత్పత్తులు జిల్లా నుంచి ఎగుమతి అవుతున్నాయని తెలిపారు. కొనపాపపేట సముద్రతీరం ఏర్పాటుచేసిన హెచరీస్, ఆక్వా ఫీడ్ తయారీ పరిశ్రమలు, ప్రాసెసింగ్ యూనిట్లలో సుమారు లక్ష మంది కార్మికులు ప్రత్యక్ష ఉపాధి పొందుతున్నారని అన్నారు. ఆక్వా సాగు యంత్రాలు, మందుల అమ్మే దుకాణాల ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి పొందుతున్న 50 వేల మంది కార్మికుల నష్టపోతారని అన్నారు. ఈ సంక్షోభం కారణంగా జిల్లాలోని నెక్కంటి, దేవి, అవంతి, అపెక్స్ వంటి పెద్ద యూనిట్లలో ప్రొడక్షన్‌ని 50 శాతానికి పరిమితం చేసి చిన్న యూనిట్లను మూసివేశారని అన్నారు. దీంతో వేలాది మంది కార్మికులు రోడ్డున పడ్డారని అన్నారు. కొన్ని పరిశ్రమల్లో 8 గంటల స్థానంలో 12 గంటల పనిని పెంచుతూ సంక్షోభ నష్టాన్ని కార్మికులపై నేడుతున్నారని విమర్శంచారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దేశ ప్రయోజనాలు కాపాడేందుకు సార్వభౌమత్వాన్ని పరిరక్షణ కోసం నిలబడాలని అన్నారు. ధర్నా అనంతరం రీ సర్వే డిటి యడ్ల శ్రీనివాస్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పట్టణ నాయకులు బాలం శ్రీనివాస్, కరణం గోవిందరాజు, బాలం హరిబాబు, కరణం ఏడుకొండలు, జగదీష్, పవన్, బాలం సత్తిబాబు, తుంపాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కొరత లేకుండా యూరియా పంపిణీ చేయాలి

ప్రజాశక్తి - పిఠాపురం

రైతులకు యూరియా కొరత లేకుండా అందజేయాలని సిపిఎం జిల్లా నాయకులు డి.శేషాబాబ్జి శనివారం ఒక ప్రకటనలో కోరారు. రైతులు యూరియా దొరకక అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. అధికారులు, ప్రభుత్వం యూరియా కొరత లేదంటూ ప్రకటనలు ఇస్తున్నారని, కానీ రైతులు యూరియా కోసం చెప్పులు అరిగెల తిరుగుతున్నాం న్నారన్నారు. ప్రయివేట్ షాపుల్లో అధిక ధరలకు యూరియా విక్రయిస్తున్నారన్నారన్నారు. యూరియా బ్లాక్ మార్కెట్‌ను అరికట్టి ఆర్‌ఎస్‌కెల ద్వార రైతులకు నేరుగా అందజేయాలన్నారు. మున్సిపాలిటీలో పరిధిలోని వార్డుల్లో డ్రెయినేజీ వ్యవస్థ, పారిశుధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా ఉందన్నారు. ఉప్పాడ పిఠాపురం రైల్వే గేట్ వల్ల ప్రజలు ఇబ్బందులకు గురవ్వుతారని, త్వరితగతిన రైల్వే ఫ్లై ఓవర్ బ్రిడ్జిని నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు. విద్యుత్ స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలని, తదితర సమస్యలు పరిష్కారం కోరుతూ సోమవారం పాడా కార్యాలయం వద్ద సిపిఎం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపడుతున్నామని, ఈ కార్యక్రమంలో ప్రజలు పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు.

యూరియా సరఫరాకు ఏర్పాట్లు

ప్రజాశక్తి - గొల్లప్రోలు

రైతులకు యూరియా ఇబ్బందులు లేకుండా సరఫరా చేస్తామని వ్యవసాయ శాఖ ఎడి పి.స్వాతి తెలిపారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో విఆర్‌ఒలు, ఆర్‌ఎస్‌కె సిబ్బందికి యూరియా సరఫరాపై సమీక్ష సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సబ్ డివిజన్లో వ్యవసాయ, ఉద్యానవన, పట్టు పరుగుల సాగు సుమారు 55 వేల ఎకరాల జరుగుతోందన్నారు. ఖరీఫ్ సీజన్‌కు 4200 మెట్రిక్ టన్నుల యూరియా అవసరం ఉందని, ఇప్పటివరకు 3200 మెట్రిక్ టన్నుల యూరియాను సొసైటీలు, ఆర్‌ఎస్‌కెలు, ప్రయివేటు పురుగుల మందుల దుకాణాల ద్వారా సరఫరా చేయడం జరిగిందన్నారు.మరో 250 మెట్రిక్ టన్నుల యూరియా వస్తుందని వివరించారు. పంటలకు రెండు, మూడు విడతలకు సెప్టెంబర్, అక్టోబర్ వరకు యూరియా వస్తుందని తెలిపారు. కావున రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. వ్యాధులు చోకకుండా నత్రజని, తగిన మోతాదులో యూరియా వాడాలని వివరించారు. ఈ సమావేశంలో మండల వ్యవసాయ శాఖ అధికారి కెవివి.సత్యనారాయణ, ఆర్‌ఐ బాలకృష్ణ, ఆర్‌డిటి ఎస్‌కె.మస్తానీ తదితరులు పాల్గొన్నారు.


సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న స్వాతి

చలో విజయవాడ జయప్రదానికి పిలుపు

ప్రజాశక్తి - కోటనందూరు

కూటమి పార్టీల ఎన్నికల హామీలను అమలు చేయాలని కోరుతూ ఈ నెల 15న జరుగుతున్న ఛలో విజయవాడను జయప్రదం చేయాలని ఎపి బిల్డింగ్ అండ్ అదర్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యనిర్వహక అధ్యక్షులు చెక్కల రాజకుమార్ పిలుపునిచ్చారు. ఈ నెల 30, అక్టోబర్ ఒకటో తేదీల్లో జగ్గంపేటలో జరగనున్న ఎపి బిల్డింగ్ అండ్ అదర్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ మహాసభ పోస్టర్‌ను శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు జగన్ ప్రభుత్వం నిలుపుదల చేసిన భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ పథకాలను అధికారంలోకి రాగానే పునరుద్ధరిస్తామని కూటమి నేతలు ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పారని గుర్తు చేశారు. అధికారంలోకి వచ్చి 13 నెలలు గడుస్తున్నా సంక్షేమ బోర్డును పునరుద్ధరించలేదని విమర్శంచారు. కార్మికుల కోసం ఖర్చు చేయాల్సిన ఏ ఒక్క రూపాయి ప్రభుత్వ ఖజానా నుంచి చెల్లించాల్సిన అవసరం లేకపోయినా, సంక్షేమ బోర్డులో రూ.3 వేల కోట్ల నిధులు ములుగుతున్నా ఆపదలో ఉన్న భవన నిర్మాణ కార్మికులను కూటమి ప్రభుత్వం ఆదుకోవడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో మండల సిఐటియు నాయకురాలు ఎస్‌కె.పద్మ పి.నాగేశ్వరరావు, సూరిబాబు, రమణ, ఏసు, రాము, అప్పారావు, సత్తిబాబు, రామ్మూర్తి పాల్గొన్నారు.



చేబ్రోలు పిహెచ్‌సి పరిశీలన

ప్రజాశక్తి - గొల్లప్రోలు

మండలంలోని చేబ్రోలు పిహెచ్‌సిని జిల్లా ప్రోగ్రాం మేనేజ్‌మెంట్ అధికారి జి.లక్ష్మి శనివారం పరిశీలించారు. ఆసుపత్రిలో అందిస్తున్న వైద్య సేవలు, రికార్డులు, ఆసుపత్రి పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీజన్ వ్యాధుల పట్ల సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, ప్రభుత్వ ఆసుపత్రిలోనే ప్రసవాలు జరిగేలా ప్రజలకు అవగాహన కల్పించాలని అన్నారు. ఆసుపత్రి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని అన్నారు. ఈ పరిశీలనలో ఆసుపత్రి వైద్యులు డాక్టర్ సాయిరతన్, ఎంపిహెచ్‌ఇఒ రామ్మోహన్, సూపర్‌వైజర్ నార్ని గంగాధర్, సిబ్బంది పాల్గొన్నారు.

విగ్రహాల పేరుతో ఉద్రిక్తతలు తగవు

ప్రజాశక్తి - కాకినాడ

నగరంలో విగ్రహాల పేరుతో ఉద్రిక్తతలు తగదని సిపిఎం నగర కన్వీనర్ పలివెల వీరబాబు శనివారం ఒక ప్రకటనలో హితవు పలికారు. శారదాదేవి ఆలయ సమీపంలోని కూడలిలో జరుగుతున్న నిర్మాణం వద్ద శనివారం ఏర్పడిన ఉద్రిక్తత పరిస్థితి నగర ప్రతిష్టను దెబ్బతీసేలా ఉందన్నారు. పాలకవర్గం లేనందున నగర పాలక సంస్థ అధికారులు అఖిలపక్షం సమావేశం నిర్వహించి ఆయా రాజకీయ పార్టీల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవాలన్నారు. విగ్రహాల పేరుతో ఉద్రిక్తతలు శాంతి భద్రతలకు భంగం కలిగించడమే కాకుండా సామాజిక బేధాభిప్రాయాలు తలెత్తే ప్రమాదం ఉందన్నారు. నగరంలో ఉద్రిక్తత పరిస్థితి తలెత్తకుండా నగర పాలక సంస్థ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

8 నుంచి ప్రమోషన్ ఎంపిడిఒలకు శిక్షణ

ప్రజాశక్తి - సామర్లకోట

ఉద్యోగోన్నతి పొందిన ఎంపిడిఒలకు స్థానిక విస్తరణ శిక్షణ కేంద్రంలో ఈ నెల 8 నుంచి 30 రోజులపాటు పాటు ప్రాథమిక శిక్షణ ఇవ్వనున్నట్లు విస్తరణ శిక్షణా కేంద్రం ప్రిన్సిపల్ కెఎన్‌వి.ప్రసాదరావు ఓ ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి జిల్లాల నుంచి రెండో బ్యాచ్‌లో 46 మంది ఎంపిడిఒలకు ఈ శిక్షణ ఇస్తామన్నారు. ప్రాథమిక శిక్షణ తర్వాత సుస్థిరాభివృద్ధి లక్ష్యాలపై మరో రెండు రోజుల ప్రత్యేక శిక్షణ ఉంటుందని తెలిపారు. పంచాయతీ విస్తరణాధికారులు, పరిపాలన అధికారులుగా పనిచేసిన వీరంతా ఇటీవల ఎంపిడిఒలుగా ఉద్యోగోన్నతి సాధించారని తెలిపారు. అలాగే సుస్థిరాభివృద్ధి లక్ష్యాలపై వివిధ జిల్లాలకు చెందిన పంచాయతీ కార్యదర్శులు 66 మందికి టిఒటిలుగా ఈ నెల 8 నుంచి 10 వరకూ 3 రోజుల శిక్షణ ఇస్తున్నామని, శిక్షణార్థులకు వసతి, ఇతర ఏర్పాట్లు చేశామని ప్రిన్సిపల్ తెలిపారు.

అఖిల్ కళాశాలలో గురుపూజోత్సవం

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

స్థానిక అఖిల్ కళాశాల ఆధ్వర్యంలో శనివారం గురుపూజోత్సవం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. స్థానిక సరయు ఫంక్షన్ హల్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శనలు ఇచ్చారు. ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్ ఇనకోటి గంగాధర్, ప్రత్తిపాడు బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు బుగతా శివ మాట్లాడారు. సమాజ అభివృద్ధిలో ఉపాధ్యాయుల పాత్ర మరువలేనిదని అన్నారు. కళాశాల ప్రిన్సిపల్ ఇనకోటి సునీత మాట్లాడుతూ జీవితంలో ఏ స్థాయికి ఎదిగిన గురువులను గౌరవించుకోవాలన్నారు. అనంతరం అఖిల్ విద్యా సంస్థ ఉపాధ్యాయులను శాలువా వేసి మెమెంటోతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.


టీచర్‌ను సత్కరిస్తున్న కళాశాల యాజమాన్యం ప్రతినిధులు

ముగిసిన విస్మయ గ్రాండ్ ఫినాలే

ప్రజాశక్తి - కాకినాడ

ఆదిత్య డిగ్రీ కళాశాల డేటా సైన్స్ విభాగం ఆధ్వర్యంలో రెండు రోజులుపాటు నిర్వహించిన విస్మయ గ్రాండ్ ఫినాలే-2025 రాష్ట్రస్థాయి సదస్సు శనివారం ముగిసింది. ముగింపు కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ఆదిత్య విద్యాసంస్థల ఛైర్మన్ డాక్టర్ నల్లమిల్లి శేషారెడ్డి మాట్లాడుతూ ముందుగా మేల్కొన్న వాడికి విజయం వరిస్తుందని అన్నారు. పోటీ ప్రపంచంలో ప్రాజెక్టులు, సర్టిఫికేషన్స్ ద్వారా సాంకేతికతను ఒడిసి పట్టిన వాడికే ఉద్యోగాలు వస్తాయని తెలిపారు. అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ నాయుడు మాట్లాడుతూ విద్యార్థులు తరగతి గదిలో చెప్పే పాఠాలకు భిన్నంగా ఆధునిక టెక్నాలజీకి అనుగుణంగా నైపుణ్యాన్ని సాధించాలని అన్నారు. జెఎన్‌టియుకె ప్రొఫెసర్ సుమలత మాట్లాడుతూ డేటా సైన్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, సైబర్ సెక్యూరిటీ, కంప్యూటర్ సైన్స్ విద్యార్థులకు ప్రస్తుత మార్కెట్లో అద్భుతమైన అవకాశాలు ఉన్నాయని తెలిపారు. ఈ సందర్భంగా నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలకు అతిథుల చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆదిత్య మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ కె.కరుణ, క్యాంపస్ ఇన్‌ఛార్జ్ మూర్తి, ఐటీ మేనేజర్ ఆర్.కార్తీక్, డేటా సైన్స్ విభాగాధిపతి జి.విజయలక్ష్మి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.




విద్యార్థులక సర్టిఫికెట్స్‌ను అందిస్తున్న శేషారెడ్డి

వల్లభునికి రూ.1.88 లక్షల ఆదాయం

ప్రజాశక్తి - పెద్దాపురం

తిరుపతి గ్రామంలోని శృంగార వల్లభ స్వామి ఆలయానికి శనివారం ఒకరోజు రూ.1,88,431 ఆదాయం సమకూరిందని ఆలయ ఇఒ వడ్డి శ్రీనివాసరావు తెలిపారు. వివిధ ప్రత్యేక దర్శనం టిక్కెట్ల ద్వారా రూ.1,20,090, అన్నదాన విరాళాల ద్వారా రూ.48,831, కేశఖండన ద్వారా రూ.5,080, తులాభారం ద్వారా రూ.300, లడ్డు ప్రసాదం ద్వారా రూ.14,130 వెరసి రూ.1,88,431 ఆదాయం వచ్చిందన్నారు. యాత్రికులకు ఉదయం పులిహోర, మధ్యాహ్నం అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు పెద్దింటి పురుషోత్తమాచార్యులు, పెద్దింటి నారాయణాచార్యులు, ఆలయ సిబ్బంది, స్వచ్ఛంద సేవకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కార్టూ'నిజం'



▸ ఆర్‌ఎంపి, పిఎంపిల తీరు
▸ ఆసుపత్రులకు సిఫార్సులు
30 శాతం కమీషన్ వసూలు

రంగా విగ్రహం తొలగింపు..ఉద్రిక్తత

ప్రజాశక్తి - కాకినాడ

స్థానిక శారదాదేవి గుడి వద్ద రంగా విగ్రహ ఏర్పాటు వివాదాస్పదంగా మారింది. రొటరీకి కేటాయించిన స్థలంలో శనివారం తెల్లవారుజామున కొంతమంది గుర్తు తెలియని వ్యక్తులు రంగా విగ్రహాన్ని ప్రతిష్ట చేశారు. రంగా విగ్రహాన్ని అధికారులు తొలగించారు. విగ్రహాన్ని తిరిగి అక్కడే పెట్టాలని ఆయన అభిమానులు డిమాండ్ చేశారు. పోలీసులకు, ఆందోళనకారులకు మధ్య వాగ్వివాదం జరిగింది.


రంగా విగ్రహాన్ని తొలగిస్తున్న పోలీసులు, అడ్డుకుంటున్న రంగా అభిమానులు

అనుమతి లేదు: కలెక్టర్

సుప్రీం కోర్టు ఉత్తర్వుల మేరకు జిల్లాలోని పబ్లిక్ రోడ్లు, పేవ్ మెంట్లు, సైడ్ వేలు, ఇతర ప్రజోపయోగ స్థలాల్లో ఎటువంటి విగ్రహాలను ఏర్పాటు చేసేందుకు అనుమతించమని కలెక్టర్ షాన్ మోహన్ సగిలి తెలిపారు. శారదాంబ గుడి సమీపంలో కొత్తగా విస్తరించిన రోడ్డు కూడలిలో తరచుగా ప్రమాదాలు జరుగుతున్న దృష్ట్యా ఈ కూడలిని రోటరీ క్లబ్ సహకారంతో అన్ని భద్రతా ఏర్పాట్లతో అభివృద్ధి చేసేందుకు అప్పగించామన్నారు. అయితే శనివారం తెల్లవారుజామున కొంత మంది వ్యక్తులు సుప్రీం కోర్టు ఉత్తర్వులను అతిక్రమించి నిబంధనలకు విరుద్ధంగా వంగవీటి రంగా విగ్రహాన్ని ఏర్పాటు చేయడానికి ప్రయత్నించగా, మున్సిపల్, పోలీస్ అధికారులు నిరోధించారని అన్నారు. జిల్లాలో అనుమతి లేకుండా, నిబంధనలను అతిక్రమించి విగ్రహాలు ఏర్పాటు చేయరాదని ఆయన ఆదేశించారు.


మహిళలకు అవగాహన కల్పిస్తున్న సచివాలయ సిబ్బంది

వాట్సాప్ గవర్నెన్స్‌పై అవగాహనా ర్యాలీ

ప్రజాశక్తి - సామర్లకోట

స్థానిక 20వ వార్డులో శనివారం వాట్సాప్ గవర్నెన్స్‌పై అవగాహనా ర్యాలీ నిర్వహించారు. సచివాలయ సిబ్బంది ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మనమిత్ర వాట్సాప్ గవర్నెన్స్ కార్యక్రమం ప్రజలు గ్రామ సచివాలయానికి వెళ్లకుండానే 700కి పైగా సేవలను పొందవచ్చుని వివరించారు. 9552300009 నంబర్‌కి 'హాయ్' అని మెసేజ్ పంపితే సేవల జాబితా వస్తుందని, అందులో కావలసిన సేవను ఎంపిక చేసుకుని క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి సులభంగా పొందవచ్చుని తెలిపారు. ఈ కార్యక్రమంలో 20వ వార్డు టిడిపి ఇన్‌ఛార్జ్ బొందల రామలక్ష్మి, నాయకులు శ్రీనివాస్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు భీమేశ్వరాలయం మూసివేత

ప్రజాశక్తి - సామర్లకోట

ఈనెల 7వ తేదీ ఆదివారం మధ్యాహ్నం 12 గంటలకు భీమేశ్వరాలయంను మూసివేస్తున్నట్లు ఆలయ కార్యనిర్వాహణాధికారి బళ్ల నీలకంఠం శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆలయాన్ని తిరిగి 9వ తేదీ ఉదయం 9 గంటలకు తెరవడం జరుగుతుందన్నారు. అలాగే 7న జరగాల్సిన అన్నప్రసాద కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు తెలిపారు కావున యాత్రికులు గమనించాలని కోరారు.

డెంగీ, మలేరియాపై అవగాహన

ప్రజాశక్తి - గొల్లప్రోలు

మండలంలోని కొడవలి గ్రామంలో గొల్లప్రోలు పిహెచ్‌సి ఆధ్వర్యంలో డెంగీ, మలేరియా, మెదడు వాపు వంటి ప్రాణాంతక వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి పర్యవేక్షకులు మాట్లాడుతూ పరిసర ప్రాంతాలు పొడిగా ఉండేలా దృష్టి సారించాలని ప్రజలకు సూచించారు. ఇళ్లలో దోమతెరలు ఏర్పాటు చేసుకోవాలని, దోమ కాటుకు గురికాకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి పర్యవేక్షకులు అహ్మద్ బాషా, ఎస్‌కె.రజిమ్‌భీమ్, లక్ష్మి ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

కొబ్బరిచెట్టు పైనుంచి పడి వార్డు మెంబర్ మృతి

ప్రజాశక్తి - ముమ్మిడివరం

కొబ్బరిబొండం తీసేందుకు కొబ్బరి చెట్టు ఎక్కి, కాలు జారీ పడిన ఘటనలో వ్యక్తి అక్కడికక్కడే దుర్మరణం పాలైన ఘటన శనివారం చోటు చేసుకుంది. దీనికి సంబంధించి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని చిన్న కొత్తలంక గ్రామ పంచాయతీ రెండో వార్డు మెంబర్ కముజు వీర వెంకట సత్యనారాయణ అలియాస్ సూరిబాబు(48) శనివారం ఉదయం ఇంటి ఆవరణలోని కొబ్బరి చెట్టు ఎక్కి కొబ్బరి బొండం తీస్తుండగా, కాలుజారి పడిపోవడంతో అక్కకి అక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య శ్రీ లక్ష్మి, కుమార్తెతో పాటు అతడిపైనే ఆధారపడిన వృద్ధ తల్లిదండ్రులు సత్య నారాయణ, సత్యవతి ఉన్నారు. దీనిపై ఎస్ఐ జ్వాలా సాగర్ కేసు నమోదుచేసి శవ పంచనామ నిమిత్తం మృతదేహాన్ని ముమ్మిడివరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, దర్యాప్తు చేపట్టారు.

హిజ్రాలపై కేసు నమోదు

ప్రజాశక్తి - ఆత్రేయపురం

వినాయకుని నిమజ్జనం కార్యక్రమంలో భాగంగా శనివారం వెలిచేరు గ్రామంలో నిర్వహించిన ఊరేగింపులో వినాయక విగ్రహ కమిటీ సభ్యులు హిజ్రాలతో అశ్లీల నృత్యాలు చేయిస్తున్నారు. ఈ సమయంలో ఎస్ఐ ఎస్.రాము దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా అశ్లీల నృత్యాలు చేస్తున్న హిజ్రాలపైనా, కమిటీ సభ్యులు పైనా కేసు నమోదు చేశారు. అలాగే వినాయక నిమజ్జనం ఊరేగింపుల్లో ఎటువంటి అనుమతులు లేకుండా డిజె సౌండ్, అశ్లీల నృత్యాలు వంటివి పాల్పడితే కేసు నమోదు చేస్తామన్నారు.

సచివాలయాల్లో అవగాహనా సదస్సులు

ప్రజాశక్తి - పెద్దాపురం

ఈ గవర్నెన్ ద్వారా ప్రజలకు అందజేస్తున్న అన్ని రకాల సేవలపై అన్ని సచివాలయాల్లో శనివారం ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్‌రెడ్డి, సతీష్, కొరుపూరి రాజు, బాలాజీ, టి దుర్గాప్రసాద్, ఎల్ఎన్‌వి.ప్రసాద్, వనజ, ప్రత్యూష, జి.దుర్గా దేవి, రత్నం పాల్గొన్నారు.


పిట్టను అటవీ సిబ్బందికి అప్పగిస్తున్న రైతు

కింగ్ ఫిషర్ పక్షి అప్పగింత

ప్రజాశక్తి - తాళ్లరేవు


ఎగరలేని స్థితిలో ఉన్న కింగ్ ఫిషర్ పక్షిని స్థానిక రైతు దూళిపూడి బాబీ అటవీ అధికారులకు అప్పగించారు. శనివారం మండలంలోని పి.మల్లవరం కృషి ఆధారిత వ్యవసాయ క్షేత్రంలో ఎగరలేని స్థితిలో కింగ్ ఫిషర్ పక్షి పడి ఉంది. ఆ పక్షిని అటవీశాఖ రేంజర్ వరప్రసాద్‌కు సమాచారం ఇచ్చారు. సిబ్బంది గోపి, విష్ణు పక్షిని స్వాధీనం చేసుకుని ప్రథమ చికిత్స అనంతరం కోరంగి అభయారణ్యంలో వదిలిపెట్టారు.


డ్రయినేజీ పక్కనే ఉన్న చెత్తాచెదారం

పూడిక తీశారు...బయట వదిలేశారు

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక వరహాలయ్యపేటలో పెద్ద డ్రెయిన్‌లోని పూడికను తీశారు. అయితే ఆ పూడికను డ్రెయిన్ పక్కనే వదిలేశారు. దీంతో ఆ ప్రాంతంలో దుర్గంధం వెదజల్లుతుంది. ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పూడికను తీసి 10 రోజులు కావస్తున్నా అక్కడ నుంచి తొలగించకపోవడాన్ని ప్రజలు తప్పు పడుతున్నారు. అధికారులు స్పందించి డ్రెయిన్ చెంతనే ఉన్న పూడికను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు..


చెక్కును అందిస్తున్న జ్యోతుల నవీన్

సిఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

ప్రజాశక్తి - జగ్గంపేట

అనారోగ్యంతో వివిధ ఆసుపత్రుల్లో వైద్య సేవలు పొందిన వారికి సిఎంఆర్ఎఫ్ నుంచి విడుదలైన చెక్కులను టిడిపి జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్‌కుమార్ పంపిణీ చేశారు. శనివారం స్థానిక టిడిపి కార్యాలయంలో 36 మందికి రూ.26,08,211 విలువ చేసే చెక్కులను లబ్ధిదారులకు అందచేశారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ కొత్త కొండబాబు, కిర్లంపూడి ఎంపిపి తోట రవి, జగ్గంపేట సొసైటీ ఛైర్మన్ బుర్రి సత్యనారాయణ, టిడిపి నాయకులు ఎస్‌విఎస్ అప్పలరాజు, జీను మణిబాబు, తోట గాంధీ, దేవరపల్లి మూర్తి, అనుకుల శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

రిటైర్డ్ ఉపాధ్యాయులకు సన్మానం

ప్రజాశక్తి - మండపేట

మండపేట మండలం ఏడిద మండల ప్రజా పరిషత్ ఆదర్శ ప్రాథమిక పాఠశాలలో శనివారం రిటైర్డ్ ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఏడిద గ్రామానికి చెందిన రిటైర్డ్ ఉపాధ్యా యులు గొల్లపల్లి సత్యనారాయణ, బూరిగ రామా రావులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పర్వతిన వీర్రాజు, రామిశెట్టి రాజా, పసుపర్తి నాగబాబు, బేతా వెంకటేశ్వరరావు, పదం ఆనందరావు, గొడవర్తి సత్యనారాయణ, ప్రధానో పాధ్యా యులు ముత్యాల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

వరద గోదావరి..



ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి

గోదావరి వరదలు నదీ పరివాహక ప్రజల కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. గత కొన్ని రోజులుగా ఎగువ రాష్ట్రాలలో కురుస్తున్న వర్షాలతో పాటు జిల్లాలోనూ ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు వరద ఉధృతి క్రమ క్రమంగా పెరుగుతోంది. అయితే గడిచిన పది రోజులలో తగ్గుతూ.. పెరుగుతూ దోబూచులాడింది. గడిచిన వారంలో రెండు దఫాలు మొదటి ప్రమాద హెచ్చరికను అధికారులు జారీ చేశారు. ఈ నేపథ్యంలో తూర్పుగోదావరి, కోనసీమ జిల్లాలలోని లంక గ్రామాల్లో నివసించే ప్రజలు బిక్కు, బిక్కుమంటూ జీవనం సాగించారు. మరోవైపు వారాంతంలో వినాయక నిమజ్జన కార్యక్రమాలకు గోదావరి వద్దకు పెద్ద సంఖ్యలో ప్రజలు చేరుకోవటంతో ఇబ్బందులు తలెత్తాయి. పరివాహక ప్రాంతాల్లో పోలీసు యంత్రాగానికి పెద్ద సవాలుగా మారింది. అయితే ఎటువంటి అవాంతరాలు లేకుండా కార్యక్రమాలు ముగియటంతో అధికార యంత్రాంగం ఊపిరి పీల్చుకుంది.

ఉపాధి కూలీలకు వేతన వెతలు

ఉపాధి కూలీలు వేతన వెతలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉపాధి పనులకు సంబంధించిన బకాయిలు నిలిచిపోవటమే ఈ దుస్థితికి కారణం. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం 2014లో అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఉపాధి చట్టానికి తూట్లు పొడుస్తున్న విషయం విధితమే. సంస్కరణల పేరుతో అనేక మార్పులు తీసుకొచ్చింది. రెండేళ్ల క్రితం నూతన సాఫ్ట్‌వేర్ అమలు చేసి కేంద్ర ప్రభుత్వ పర్యవేక్షణ అంటూ సాకు చెప్పింది. దీనికి తోడుగా రాష్ట్రంలో ప్రభుత్వాలు మారిన ప్రతిసారీ ఫీల్డ్ అసిస్టెంట్లను వేధింపులకు గురి చేస్తూ అక్రమ తొలగింపులకు పాల్పడుతున్నాయి. మరోవైపు ఉపాధి చట్టానికి తూట్లు పొడిచి నెలల తరబడి కూలీలకు బకాయిలు పెట్టడం పరిపాటిగా మారింది. తక్షణమే ఉపాధి బకాయిలు చెల్లించాలని ఉపాధి కూలీలు, ప్రజాసంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

ఫీవర్ ఫియర్

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా విషజ్వరాలు విజృంభించటంతో ప్రభుత్వ ఆస్పత్రులు కిటకిటలాడుతున్నాయి. గత కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో పల్లెలు, పట్టణాలలో పారిశుధ్య నిర్వహణ అటకెక్కింది. దీంతో దోమల వృద్ధి గణనీయంగా పెరిగింది. ఫలితంగా డెంగీతో పాటు ఇతర జ్వరాల విజృంభణ ఒక్కసారిగా పెరిగింది. ఇటువంటి పరిస్థితులను అధిగమించేందుకు వైద్య ఆరోగ్య శాఖతో పాటు నగరపాలికలు, పంచాయతీలు కలిసి రావాల్సి ఉంది. పారిశుధ్య నిర్వహణ, తాగునీటి సరఫరా కలుషితం కాకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవటంతో పాటు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలనే డిమాండ్ వ్యక్తమవుతుంది. అదేవిధంగా పిహెచ్‌సిలు, సిహెచ్‌సిలలో వసతులు, సౌకర్యాలు మెరుగుపర్చి ప్రజలకు భరోసా ఇవ్వాల్సిన అవసరం ఉంది.

యూరియా కోసం రైతుల వెతలు

యూరియా కోసం రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు. క్షేత్రస్థాయిలో సమస్యలు ఉన్నప్పటికీ అధికార యంత్రాంగ భిన్నమైన ప్రకటనలు చేయటం రైతులను ఆందోళనకు గురి చేస్తోంది. ఉద్దేశపూర్వకంగా ప్రభుత్వ ప్రతిష్టను దెబ్బతీస్తున్నారంటూ అధికార పార్టీ నేతలు చేస్తున్న వాఖ్యలు వారి చిత్తశుద్ధిని దర్పణం పడుతుంది. మరోవైపు యూరియా కొరత లేదంటూ అధికార యంత్రాంగం జిల్లా వ్యాప్తంగా నిల్వలపై బులిటెన్ విడుదల చేస్తోంది. మరోవైపు చేపల చెరువులకు లేదా పరిశ్రమలకు తరలిపోయిందా అనే విషయమై పరిశీలన పెరిగింది. మరోవైపు నానో ఎరువులు వినియోగించాలంటూ వ్యవసాయ శాఖ అధికారులు ప్రచారాన్ని ముమ్మరం చేశారు. ఈ రకమైన ఎరువుల వినియోగంపై రైతుల్లో అనేక సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఉన్నతాధికారులు చొరవ తీసుకుని రైతులకు ఇబ్బందులు లేకుండా ఎరువులు అందించాలని రైతులు, రైతు సంఘాలు కోరుతున్నాయి.

సచివాలయ ఉద్యోగుల నిరసన

ప్రజాశక్తి - పిఠాపురం

అదనపు విధులతో ఇబ్బందులకు గురి చేస్తున్నారంటూ సచివాలయ ఉద్యోగులు నిరసన వ్యక్తం చేశారు. శనివారం స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేసి అనంతరం కమిషనర్ ఎన్.కనకరావుకి వినతిపత్రం అందజేశారు. నల్లబాడ్జీలతో విధులకు హాజరయ్యారు. ఈ సందర్భంగా సచివాలయ ఉద్యోగులు మాట్లాడుతూ గతంలో వాలంటీర్లు ఒక క్లస్టర్‌కు పరిమితమైన నిర్వహించిన విధులను సచివాలయ ఉద్యోగులు ఒకటి కంటే ఎక్కువ క్లస్టర్‌కు మ్యాప్ చేసి బలవంతంగా ఇంటింటికి విధులు అప్పగిస్తున్నారన్నారు. వాట్సాప్ గవర్నెన్స్ సర్వీస్‌కు సంబంధించి సేవలపై ప్రతి ఇంటికి వెళ్ళి అవగాహన కల్పించమంటున్నారని అలా వెళ్ళి అవగాహన కల్పించడం సాధ్యం కాదన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కన్నారావు, కోటేశ్వరరావు, రాజ్ కుమార్, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.


నిరసన వ్యక్తం చేస్తున్న సచివాలయ ఉద్యోగులు

ఎరువులను బ్లాక్ చేస్తే చర్యలు

ప్రజాశక్తి - సామర్లకోట

ఎరువులకు కృత్రిమ కొరత సృష్టించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని మండల ప్రత్యేక అధికారి, జిల్లా భూగర్భ జల శాఖ అధికారి రామకృష్ణ హెచ్చరించారు. శనివారం మండల రెవెన్యూ కార్యాలయంలో తహాశీల్దార్, ఎంపిడిఒ, పోలీసులతో కలిసి మండల స్థాయి ప్రత్యేక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరంతరం ఎరువుల విక్రయాలపై తనిఖీలు నిర్వహించి రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఈ సీజన్లో ఇప్పటివరకు 3034 మెట్రిక్ టన్నుల ఎరువుల అవసరం ఉండగా 2698 మెట్రిక్ టన్నుల సరఫరా చేయడం జరిగిందని, మిగిలిన ఎరువులు త్వరలోనే సరఫరా చేయడం జరుగుతుందన్నారు. రైతులు ఎవరూ ఆందోళన చెందవద్దని ఆయన సూచించారు. ఈ సమావేశంలో తహశీల్దార్ కొవ్వూరి చంద్రశేఖర్ రెడ్డి, వ్యవసాయాధికారి వంగపండు మురళీధర్, ఎంపిపిఒ కార్యాలయ ఎఒ సతీష్, ఎఎస్ఐ, సిబ్బంది పాల్గొన్నారు.

స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

ప్రజాశక్తి - తాళ్లరేవు

మండలంలోని గాడిమొగ గ్రామపంచాయతీ చిన వలసలలో స్మార్ట్ రేషన్ కార్డులను కూటమి నాయకులు శనివారం పంపిణీ చేశారు. డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా తెలుగు యువత కార్యనిర్వహణ కార్యదర్శి పెసింగి నాగబాబు, నాయకులు అరదాడి సూరిబాబు, పెసింగి వీర వర్మ, మల్లాడి సత్తిబాబు, తదితరులు పాల్గొన్నారు.

పిచ్చికుక్క స్వైర విహారం

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక తాడితోట ఏరియాలో శనివారం కిరాణా షాపునకు వెళ్తున్న ఆరేళ్ల బాలికపై వీధి కుక్క దాడి చేసి తీవ్రంగా గాయపరిచింది. చుట్టుపక్కల వారు ఈ సంఘటన చూసి కుక్కను కర్రలతో తరమికొట్టారు. ఈ దాడిలో తాడితోటకు చెందిన ఆరేళ్ల బాలిక పోసినపల్లి లక్ష్మీదుర్గ తలపై, శరీరంపై తీవ్రంగా గాయపడటంతో ఆమెను వెంటనే స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం ఆమెను మెరుగైన చికిత్స కోసం కాకినాడ జిజిహెచ్‌కు తరలించారు.

రైతులకు అందుబాటులో యూరియా

ప్రజాశక్తి - తాళ్లరేవు

రైతులకు యూరియా అందుబాటులో ఉందని వ్యవసాయ శాఖ అధికారి ప్రశాంతి తెలిపారు. శనివారం సుంకరపాలెంలోని మన గ్రోమోర్ షాపుకి వచ్చిన 20 మెట్రిక్ టన్నుల యూరియా స్టాకును డిటి సూరిబాబు, ఎఒ ప్రశాంతి పరిశీలించారు. యూరియా అందుబాటులోకి రావడంతో పాటు, మరో రెండు రోజుల్లో కావలసిన స్టాకు మండలానికి వస్తుందని, రైతాంగం ఆందోళన చెందవద్దని తెలిపారు.

రైతుల ఆర్థికాభివృద్ధికి సొసైటీల తోడ్పాటు

ప్రజాశక్తి - కాజులూరు


సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సుభాష్

రైతుల ఆర్థిక అభివృద్ధికి పిఎసిఎస్‌లు తోడ్పాటును అందించాలని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. శనివారం కోలంక సొసైటీ నూతన అధ్యక్షుడిగా బొండా వెంకట నరసింహ నాయుడు, సభ్యులుగా గుబ్బల కృష్ణమూర్తి, మేడిశెట్టి వెంకటేశ్వర్లు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడారు. సహకార వ్యవస్థ అనేది గ్రామ అభివృద్ధికి ఎంతో ఉపయుక్తకరమని అన్నారు. ప్రభుత్వం తరపున గ్రామీణ రైతులకు అందుబాటులో ఉన్న పథకాలను వర్తింప చేయాలన్నారు. తక్కువ వడ్డీపై రుణాలు, మేలు మద్దతు ధర, భద్రతా పథకాలను అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌సి పేరాబత్తుల రాజశేఖర్, ఈస్టన్ డెల్టా ప్రాజెక్టు ఛైర్మన్ మురాలశెట్టి సునీల్‌కుమార్, డిసిసిబి ఛైర్మన్ తుమ్మల రామస్వామి, మాజీ మంత్రి చిక్కాల రామచంద్రరావు, రామచంద్రపురం నియోజకవర్గ జనసేన ఇన్‌ఛార్జ్ పోలిశెట్టి చంద్రశేఖర్, కోటిపల్లి, కాజులూరు డిసిలు దాట్ల విజయగోపాలరాజు, లకాని కృష్ణచైతన్య పాల్గొన్నారు.

యూరియా కొరత నివారణకు చర్యలు

ప్రజాశక్తి - పిఠాపురం


సమావేశంలో మాట్లాడుతున్న వర్మ

రైతులకు యూరియా కొరత లేకుండా కూటమి ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందని మాజీ ఎంఎల్ఎ ఎస్‌విఎస్ఎన్.వర్మ అన్నారు. శనివారం స్థానిక టిడిపి కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. యూరియా ఇబ్బందులు లేకుండా సిఎం చంద్రబాబు ఎప్పటి కప్పుడు పరిస్థితిని సమీక్షిస్తున్నా రని అన్నారు. అలాగే ప్రతి రైతుకు రెండు బస్తాలు చొప్పున ఎరువుల సరఫరా తోపాటు ప్రైవేట్ దుకాణాల్లోనూ ఎరువుల ఉండేలా చర్యలు తీసుకున్నట్లు తెలి పారు. వైసిపి క్షుద్ర రాజకీయాలకు పాల్పడుతూ లేని సమస్యలు ఉన్నట్టు చిత్రీకరిస్తున్నారని విమర్శంచారు. గత ప్రభుత్వ హయాంలో రైతులు దాన్యం బకాయిలు చెల్లించలేదని, యూరియా లభించక రైతులు రోడ్డు ఎక్కినా ఏ రోజు పట్టించుకోలేదని ఆరోపించారు. వర్షాల తో పంట నష్టపోయిన రైతులను ఏనాడు పలకరించిన దాఖలాలు లేవన్నారు. కూటమి ప్రభుత్వంలో రైతుల కు ధాన్యం బకాయిల సకాలంలో జమ చేస్తున్నా మని, ఎరువులు, యూరియా కొరత లేకుండా, పెట్టుబడి సాయం అందిస్తున్నామన్నారు.

బలహీన వర్గాల అభివృద్ధే లక్ష్యం

ప్రజాశక్తి - కాకినాడ

బడుగు, బలహీన వర్గాల అభివృద్ధే కూటమి ప్రభుత్వం లక్ష్యమని ఎపి బిసి కోపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ ఛైర్మన్ రెడ్డి అనంతకుమారి అన్నారు. శనివారం ఆమె నగరంలో పర్యటించారు. జగన్నాధపురం 18 వ డివిజన్‌లో నిర్వహిస్తున్న మహిళల ఉచిత కుట్టు మిషన్ శిబిరాన్ని సందర్శించి శిక్షణ పొందుతున్న మహిళలతో మాట్లాడారు. బిసి కులాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. వెనకబడిన వర్గాల మహిళల ఆర్థిక అభివృద్ధికి కుట్టు మిషన్ శిక్షణ ఇచ్చి ఉచితంగా కుట్టు మిషన్లు అందిస్తున్నట్లు తెలిపారు. బిసి కార్పొరేషన్ ద్వారా సబ్సిడీ రుణాలను అందిస్తామని అన్నారు. ఎంఎల్ఎ వనమాడి కొండబాబు మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం బిసి కార్పొరేషన్‌ను నిర్వీర్యం చేసిందని విమర్శంచారు. కూటమి ప్రభుత్వం బడ్జెట్లో బిసి వర్గాలకు అధిక నిధులు కేటాయించి, బిసి కులాలను అన్ని విధాలుగా ఆదుకోవడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో నగర టిడిపి అధ్యక్షులు మల్లిపూడి వీరు, నాయకులు బొడ్డు శివాజీ, నులుకుర్తి వెంకటేశ్వరరావు, మందాల గంగ సూర్యనారాయణ, కోపనాతి నాగ కుమారి, తుమ్మల సునీత, రిక్కా లక్ష్మి, తదితరులు పాల్గున్నారు.

ఆదిత్య విద్యార్థుల పారిశ్రామిక సందర్శన

ప్రజాశక్తి - గండేపల్లి

విశాఖపట్నంలోని మిరాకిల్ సాఫ్ట్‌వేర్ సిస్టమ్స్‌ను ఆదిత్య బి.టెక్ 3వ సంవత్సరం డేటా సైన్స్ విద్యార్థులు పారిశ్రామిక సందర్శన చేశారు. శనివారం జరిగిన ఈ సందర్శనలో విద్యార్థులు పరిశ్రమలో అనుసరిస్తున్న తాజా సాఫ్ట్‌వేర్ సాంకేతికతలు, ఆధునిక సాధనాలు, సాఫ్ట్‌వేర్ అభివృద్ధి విధానాలపై అవగాహన పొందారని డిప్యూటీ ప్రో.ఛాన్సలర్ డాక్టర్ ఎం.శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఇలాంటి పారిశ్రామిక సందర్శనలు విద్యార్థుల విజ్ఞానాన్ని విస్తరించి, వారి ఆత్మవిశ్వాసాన్ని పెంచుతాయని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇండస్ట్రియల్ విజిట్ కో-ఆర్డినేటర్ డాక్టర్ ఐ.వీరాంజనేయులు, విభాగం అధ్యాపకులు ఎన్‌డి.ప్రసన్న, సిహెచ్.శ్రీదివ్య పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సత్కారం

ప్రజాశక్తి - తాళ్లరేవు

మండలంలోని తాళ్లరేవు రత్నావారిపేట ప్రాథమిక పాఠశాలలో శనివారం పలువురు ఉత్తమ ఉపాధ్యాయులను పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు ఘనంగా సత్కరించారు. స్థానిక పాఠశాలలో సుదీర్ఘ కాలం పనిచేసి ఎంతో మంది విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్ది బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయుడు రెడ్డి వెంకటసత్యనారాయణ, పాఠశాలలో వాలంటీర్‌గా పనిచేస్తున్న రత్న మంగాదేవిలను దుస్సాలువ, పూలమాలలతో సత్కరించారు. అలాగే ఎస్ఎంసి ఛైర్మన్ రేకాడి మహాలక్ష్మి, పూర్వపు ఛైర్మన్ రత్న శశిరేఖలను సత్కరించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం చెక్కా త్రిమూర్తులు, ఉపాధ్యాయులు, ప్రజాసంఘాల మండల కన్వీనర్ టేకుమూడి ఈశ్వరరావు, స్థానికులు, విద్యార్థుల తల్లి తండ్రులు పాల్గొన్నారు.


ఉపాధ్యాయులను సత్కరిస్తున్న స్థానిక పెద్దలు

ఎరువుల షాపుల్లో విజిలెన్స్ తనిఖీలు

ప్రజాశక్తి - సామర్లకోట

పట్టణ, మండల పరిధిలోని జి.మేడపాడులోని కోరమండల్ ఎరువుల షాపులను శనివారం వ్యవసాయ శాఖ, విజిలెన్స్ అధికారులు సంయుక్తంగా తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో బయోస్టిమివెంట్స్ అమ్మడానికి అవసరమైన పత్రాలను చూపకపోవడంతో రూ.80,136 విలువ గల స్టాకు అమ్మకాలు నిలిపివేయాలని ఆదేశాలు ఇచ్చినట్లు మండల వ్యవసాయ అధికారి వంగపండు మురళీధర్ చెప్పారు. ఈ తనిఖీల్లో విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ స్పెషల్ బ్రాంచ్ సిఐ ఐ.గోపాలరావు, తహశీల్దార్ కె.విజయకుమార్, ఎఇఒ ఎం.శాంతి కమల పాల్గొన్నారు.


తనిఖీలు నిర్వహిస్తున్న విజిలెన్స్ అధికారులు


ఆర్ఎస్‌కె వద్ద క్యూలో ఉన్న రైతులు

ఎరువుల కోసం తప్పని పాట్లు

ప్రజాశక్తి - పెద్దాపురం

ఎరువులు అందక రైతులు ఆర్ఎస్‌కెల వద్ద పడిగాపులు పడుతున్నారు. మండల పరిధిలోని ఏటుపట్టు అన్ని గ్రామాల్లో, మెట్ట గ్రామాల్లో చెరువులు కింద రైతులు వరి పండిస్తున్నారు. ఈ ఏడాది యూరియా రైతులకు సకాలంలో సరఫరా కాక వారిలో తీవ్ర ఆందోళన నెలకొంది. దీనిపై మండల వ్యవసాయ అధికారి కె.సంజయ్‌కుమార్ మాట్లాడుతూ మండల పరిధిలో యూరియా కొరత ఉందన్నారు. యూరియా 600 టన్నుల అవసరం ఉందన్నారు. అత్యవసరంగా 200 టన్నులు అవసరం ఉందన్నారు. శనివారం రాత్రికి 50 టన్నులు, ఆది, సోమవారల్లో మరో వంద టన్నులు మండలానికి చేరుతుందన్నారు. ఆర్ఎస్‌కెల వద్ద రైతులకు సరఫరా చేస్తామన్నారు.

ముగిసిన హ్యాండ్స్ ఆన్ శిక్షణ

ప్రజాశక్తి - గండేపల్లి

సూరంపాలెం ఆదిత్య ఇసిఇ విభాగంలో ఐదు రోజులపాటు జరిగిన హాండ్స్-ఆన్ శిక్షణ శనివారంతో ముగిసింది. ఎడబ్ల్యూఎస్ క్లౌడ్ కంప్యూటింగ్‌పై ఇచ్చిన శిక్షణలో ఆంధ్రప్రదేశ్ స్టేట్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎపిఎస్ఎస్‌డిసి) నుంచి జె.లోవరాజు ట్రైనర్‌గా వ్యవహరించారని డిప్యూటీ ప్రో ఛాన్సలర్ డాక్టర్ శ్రీనివాసా రెడ్డి తెలిపారు.

ఆదిత్య సివిల్ విభాగంలో అతిథి ఉపన్యాసం

ప్రజాశక్తి - గండేపల్లి

సూరంపాలెం ఆదిత్య విశ్వవిద్యాలయం సివిల్ విభాగంలో శనివారం స్మార్ట్ మెటీరియల్స్ అండ్ టెక్నాలజీస్ ఫర్ సస్టైనబుల్ కాంక్రీట్ కన్స్ట్రక్షన్ అనే అంశంపై అతిథి ఉపన్యాసాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐసిఐ అధ్యక్షుడు డాక్టర్ వి.రామచంద్ర, ఐసిఐ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ ఆర్.నాగేంద్ర, ఐసిఐ సెక్రటరీ జనరల్ ఆర్ఆర్. రాధాకృష్ణన్, ఐసిఐ కాకినాడ సెంటర్ ఛైర్మన్ డాక్టర్ బాదం సుందరరావు పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమాన్ని డాక్టర్ ఎస్.గోవిందరాజన్, ఎన్.అనూష, ఎ.జార్జ్, డి.నోయెల్ సమన్వయకర్తలుగా వ్యవహరించారు.